క్లుప్తంగా

ఉపాధ్యాయ సంఘం నేత మృతికి సంతాపం



రాజు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ రఘువర్మ

రాంబిల్లి : ఉపాధ్యాయునిగా, ఉపాధ్యాయ సంఘం నాయకుడుగా ఎస్‌వీఎస్‌ఎన్ రాజు చేసిన సేవలు ఆదర్శప్రాయమని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.రఘువర్మ అన్నారు. ఇటీవల మృతిచెందిన రాజు సంతాప సభను ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో రాంబిల్లిలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాజు లేని లోటు తీరనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కె. శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వెంకటపతిరాజు, జిల్లా అధ్యక్షుడు ధర్మారావు, ఎంఈవోలు సూర్యారావు, సూర్యనారాయణ, ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కిరణ్, అప్పాజీ, ధనుంజయ్, కామరాజు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల్లో రాణించాలంటే ఏకాగ్రత అవసరం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

మునగపాక : విద్యార్థులు లక్ష్యం కోసం కష్టపడి చదువుకోవాలని విశ్రాంత ఎంఈవో శిష్టా తమ్మిరాజు కోరారు. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్, అనకాపల్లి షిరిడీ సాయి లా కళాశాలల సంయుక్త నిర్వహణలో ఏర్పాటు చేసిన ఉచిత పాలిసెట్ శిక్షణ తరగతుల్లో భాగంగా నిర్వహించిన మోడల్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు బుధవారం బహుమతులు అందజేశారు. ఇటువంటి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లా కళాశాల కరస్పాండెంట్ పెంటకోట వెంకటరావు, సంస్థ సభ్యులు కె.వి. రమణ, మాడెం జోగారావు, ఎం.సత్యనారాయణమూర్తి, ఆడారి సతీష్‌కుమార్, రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణ రాట



సాంబశివుని కల్యాణ రాటలో పాల్గొన్న భక్తులు

మునగపాక : మునగపాకలోని పల్లపు వీధి సాంబశివుని ఆలయం వద్ద బుధవారం భక్తి శ్రద్ధలతో కల్యాణ రాట మహోత్సవం నిర్వహించారు. ఈ నెల 5న ఆలయ వార్షికోత్సవంలో భాగంగా పార్వతీ-పరమేశ్వరుల కల్యాణం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు తెలిపా రు. వార్షికోత్సవం సందర్భంగా ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. అదే రోజు సాయంత్రం గ్రామంలో ఉత్సవ విగ్రహాలను ఊరేగించి రాత్రి 8 గంటలకు కల్యాణం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, కమిటీ సభ్యులు మావూరి కాశీ, పెద్దలు ఆలంక ప్రకాశరావు, కుంది సూర్యనారాయణ పాల్గొన్నారు.

నేటి నుంచి బీటీ రోడ్డు పనులు



బీటీ రోడ్డుగా మారనున్న పూడిమడక రోడ్డు

మునగపాక : ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక నేటి నుంచి నెరవేరనుంది. ఏళ్ల తరబడి రహదారి సమస్యతో సతమతమవుతున్న ఈ ప్రాంత ప్రజల కష్టాలు తీరనున్నాయి. ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు(కన్నబాబురాజు) ప్రత్యేక కృషితో పూడిమడక రోడ్డుకు శాశ్వత పరిష్కారం లభించింది. అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వరకు ఉన్న 14 కిలోమీటర్ల రహదారి గోతులమయంగా ఉండడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన ఎమ్మెల్యే కన్నబాబు వీఎంఆర్‌డీఏ ద్వారా రూ.6.5 కోట్ల మేర నిధులు విడుదలయ్యేలా కృషి చేశారు. గురువారం నుంచి బీటీ రోడ్డు పనులు ప్రారంభమయ్యేలా అధికారులు చర్యలు చేపట్టారు. అయితే రహదారి నిర్మాణం పూర్తయ్యే వరకు కేవలం ద్విచక్ర వాహనాలు మాత్రమే రాకపోకలు జరిగేలా సహకరించాలని అధికారులు కోరుతున్నారు.



నక్కపల్లిలో దివ్యాంగుడుని పింఛను కోసం తీసుకు వస్తున్న దృశ్యం

'ఐదేళ్ల నుంచి ఇల్లు కదలకుండానే వలంటీరు తెచ్చి పెతినెలా ఒకటో తేదీనే పింఛనీ ఇచ్చేవోడు. పైసా కూడా ఇచ్చేటోళ్లం కాదు. ఒకటో తేదీ దాటిపోయింది. వలంటీరు పింఛను ఇవ్వలేదేంటని ఆరాతీస్తే చావు కబురు చల్లగా చెప్పేరు. ఇక నుంచి వలంటీరు రాదంట, పింఛనీ కోసం మనమే పంచాయతీ ఆపీసుకు వెల్లాలంట, ఏం చేయాలో తోచడం లేదు ఒక వైపు ఎండ మండిపోతోంది...పొద్దున్న ఒకసారి వెళ్లి వచ్చేను..సెక్రటరీ పింఛను డబ్బుల కోసం బ్యాంకుకు వెళ్లేరంట సాయంత్రం రమ్మన్నారు. మళ్లీ వత్తన్నాను ఇప్పుడైనా ఇత్తారో లేదో....' అంటూ చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన చల్లపల్లి సత్తిబాబు అనే దివ్యాంగుడు మూడు చక్రాల సైకిలు నడుపు కొంటూ పంచాయతీ కార్యాలయానికి వస్తూ తన గోడు చెప్పుకున్నాడు.. 'పొద్దున్న వచ్చేము సెక్రటరీగారు బ్యాంకుకు వెళ్లారంట ఆయన వచ్చే వరకు ఇక్కడే ఉన్నాం మళ్లీ మళ్లీ తిరగలేక... అంటూ అంటూ పలువురు వృద్ధులు ఉసూరుమంటూ ఎండల్లో పడిగాపులు కాస్తున్నారు. ఇవీ పింఛన్ల పంపిణీ సందర్భంగా బుధవారం కనిపించిన దృశ్యాలు...

పింఛను కోసం... పడిగాపులు..

- పండుటాకుల అవస్థలు
- మండుటెండలో పంచాయతీల చుట్టూ తిరగలేక ఆవేదన
- చంద్రబాబుకు శాపనార్థాలు

నక్కపల్లి : వలంటీర్లపైన కక్ష కట్టి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేసి వలంటీర్ల ద్వారా ఇంటింటికీ పింఛన్ల పంపిణీ చేపట్టకుండా చంద్రబాబు అండ్ కో అడ్డుకోవడంతో వృద్ధులకు కష్టాలు ప్రారంభమయ్యాయి. ఒకటో తేదీన వలంటీర్ల ద్వారా వృద్ధులు, వికలాంగులకు, ఇతర పింఛన్ల లబ్ధిదారులకు పింఛను నగదు అందకుండా పోయింది. అవ్వాతాతలు మండుటెండలో పింఛను సొమ్ము కోసం పంచాయతీ కార్యాలయాల వద్ద పడిగాపులు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. మాకేంటి ఈ ఖర్మ, మాతో రాజకీయాలేంటి. ఎండలో మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నాడు. చంద్రబాబుకు మా ఉసురు తప్పకుండా తగులుతుందంటూ పండుటాకులు శాపనార్థాలు పెడుతున్నారు.

నగదు బట్వాడాకూ కష్టాలు

బుధవారం పింఛన్ల పంపిణీ పూర్తిస్థాయిలో జరగలేదు.బ్యాంకులకు వెళ్లి నగదు డ్రాచేసుకోవడం, ఈ నగదుకు సరైన లెక్కలు చూపించి గ్రామాల్లోకి వెళ్లడానికి ఎన్నికల సంఘం నియమించిన ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, చెక్ పోస్టులను దాటుకుంటూ రావడానికి సాయంత్రం అయింది. సాయంత్రం నుంచి కొన్ని గ్రామాల్లో పింఛన్ల బట్వాడా ప్రారంభమయింది. నియోజకవర్గంలో మొత్తం 47,881 పింఛను దార్లు ఉన్నారు. వీరిలో నక్కపల్లి మండలంలో 12,480 మంది, పాయకరావుపేట మండలంలో 13,275 మంది, కోటవురట్ల మండలంలో 9686 మంది, ఎస్.రాయవరం మండలంలో 12440 మంది ఉన్నారు. వీరందరికీ బుధవారం నుంచి పింఛన్ల పంపిణీని అధికార యంత్రాంగం ప్రారంభించింది. సచివాలయాలు, సామాజిక భవనాల వద్ద వీరందరిని పిలిపించి పంపిణీ చేస్తున్నారు. పింఛను కోసం ఉదయం నుంచే అవ్వాతాతలతోపాటు, దివ్యాంగులు ఆయా కార్యాలయాల వద్ద పడిగాపులు కాసారు.

ఎదురు చూసి..చూసి నిట్టూర్చి..

ఎస్.రాయవరం : గ్రామ సచివాలయాలు వద్ద బుధవారం ఏప్రిల్ నెల పెన్షన్లు కోసం పండుటాకులు ఎదురు చూస్తూ నగదు రాలేదని వెనుతిరిగారు. ప్రతినెలా ఇంటికి వచ్చి పింఛన్లు ఇచ్చే వలంటీర్లను ఏ దుర్మార్గుడు అడ్డుకున్నాడో అని దుయ్యబట్టారు. వలంటీర్ల ద్వారా ఇంటికి వచ్చే పించన్‌ను సెంద్ర బాబు ఆపేశాడంట, మూడో తేదీన సచివాలయాల వద్ద పెన్షన్ ఇస్తారని తెలిసి వచ్చాము.. ఎవరూ రాలేదు, 10 గంటలయ్యాక ఇప్పుడు డబ్బులు రాలేదని, రేపు రమ్మని ఎలిపొమ్మన్నారు...అంటూ పలువురు వృద్ధులు ఉసూరుమన్నారు. బుధవారం సాయంత్రానికి కూడా ఏ గ్రామంలోనూ పింఛన్ పంపిణీ ప్రారంభం కాలేదు.



పింఛను కోసం చినదొడ్డిగల్లు సచివాలయం వద్ద పడిగాపులు కాస్తున్న వృద్ధులు

సచివాలయాల వద్ద ఎదురుచూపులు

మునగపాక: మండల వ్యాప్తంగా బుధవారం మధ్యాహ్నం నుంచి సచివాలయాల వద్ద పింఛన్‌ల పంపిణీ నిర్వహించారు. సంబంధిత నగదు తీసుకోవడం ఆలస్యం కావడంతో పింఛన్ల బట్వాడా మధ్యాహ్నం వరకూ ప్రారంభం కాలేదు. దీంతో పలు సచివాలయాల వద్ద లబ్ధిదారులు ఉదయం నుంచి పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఎండవేడిమికి కొంతమంది పింఛన్ కోసం వచ్చి ఇబ్బందులు పడ్డారు. ఈ నెల 6వ తేదీ వరకు సచివాలయాల పరిధిలో పింఛన్‌లు అందజేస్తామని దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడేవారికి ఇంటి వద్దకే అధికారులు వచ్చి పింఛన్‌లు అందజేస్తారని ఎంపీడీవో మన్మథరావు తెలిపారు.

మాకు వడదెబ్బ తగిలితే ఎవరు బాధ్యులు

కొద్దిరోజులుగా ఆరోగ్యం సహకరించడం లేదు. పెతినెలా వచ్చే పింఛను తోటే మందులు కొనుక్కుంటున్నాం. ఇంటికే తెచ్చి పింఛను ఇవ్వడంతో ఇబ్బంది ఉండేది కాదు. మళ్లీ కథ మొదటికొచ్చింది. చంద్రబాబు ఆపేయడం వల్లే పింఛన్లు ఇంటికి తెచ్చి ఇవ్వలేదని తెలిసింది. సచివాలయానికి మండు టెండలో కాళ్లు ఈడ్చుకుంటూ రావడానికి చాలా ఇబ్బంది పడ్డాను. మాలాంటోళ్లకు వడ దెబ్బతగిలితే ఎవరు బాధ్యులు. వలంటీర్లను, పింఛన్ల పంపిణీ రాజకీయం చేయడం తగదు.

-కొండలరావు, నక్కపల్లి



చినదొడ్డిగల్లులో పింఛను కోసం అతికష్టం మీద సచివాలయానికి వస్తున్న సత్తిబాబు



నక్కపల్లిలో పింఛను కోసం అరోగ్యం బాగాలేకపోయినా సరే సచివాలయానికి వచ్చిన కొండలరావు

ఇక మాకు అవస్థలేనా...



అయిదేళ్లుగా ఎటువంటి చీకూ చింత లేకుండా ఇంటి వద్దకే పింఛన్ వచ్చేది. ఇపుడు ఇదేంటి బాబూ మాకీ కష్టాలు. వలంటీర్లతో ప్రభుత్వానికి పేరొస్తుందనే అక్కసుతో చంద్రబాబు వాళ్లని ఆపేయించి ప్రజల్ని ఇబ్బందులు పెడుతున్నారు. సచివాలయాల ద్వారా పింఛన్ ఇస్తారని చెబుతున్నారు. ఎండల్లో పింఛన్ కోసం గంటల కొలదీ ఎదురు చూడాలా...! జగన్‌బాబు దేముడు లాంటివాడు. పిల్లలకు అమ్మఒడి, చదువుకునే వారికి విద్యాదీవెన, వసతి దీవెన, పేదోళ్లకు సొంతిల్లు...ఇలా అన్ని పథకాలు వలంటీర్ ద్వారా అందేలా చూశారు. మంచోళ్లకు మంచే జరుగుతుంది. జగన్‌బాబు లాంటి మంచోళ్లకు ప్రజల ఆశీస్సులు ఉంటాయి.

-పాలమరౌట్టి సత్యవతి, మునగపాక

వలంటీర్లవి నిస్వార్థ సేవలు



ఐదేళ్ల నుంచి వలంటీరు ఇంటికి తెచ్చి పింఛను ఇచ్చేవోడు. మాకు ఏ ఇబ్బంది ఉండేదికాదు. ఒక్క రూపాయి కూడా మామూళ్లు ఇవ్వలేదు. నిస్వార్థంగా సేవలు చేశారు. కరోనాలో కూడా మేం ఇల్లు కదలకుండా ఇంటి దగ్గరే పింఛను తీసుకున్నాం. ప్రాణాలకు తెగించి మా ఇళ్లకు వచ్చి పింఛను డబ్బులు ఇచ్చేరు. అటువంటి వలంటీర్లను రాజకీయం చేసి మాకు పింఛన్లు ఇవ్వకుండా అడ్డుకుని మమ్మల్ని ఇబ్బందిపెడుతున్నారు. చంద్రబాబు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

– దుబాసి రామకృష్ణ, నక్కపల్లి

బూటకపు హామీలు నమ్మి మోసపోవద్దు



దేవవరంలో ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులుకు స్వాగతం పలికి ప్రచారంలో పాల్గొన్న గ్రామస్తులు



కొబ్బరి చీపుర్లు తయారు చేసే మహిళల కష్టాలు తెలుసుకుంటున్న అభ్యర్థి కంబాలజోగులు

నక్కపల్లి : దేవవరంలో బుధవారం వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం హోరెత్తింది. సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులకు గ్రామానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, మహిళలు కోలాటాలు, తప్పెట గుళ్లు, డప్పులతో ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే జోగులు ఇంటింటికీ వెళ్లి ఓటు అభ్యర్థించారు. కొబ్బరి చీపుర్లు తయారు చేసే మహిళా కూలీల వద్దకు వెళ్లి వారి కష్టాలు యోగ క్షేమాలు తెలుసుకున్నారు. రోజంతా కష్టపడితే కూలి గిట్టుబాటు అవుతుందని, ఇలాంటి వారి కోసమే జగనన్న ప్రభుత్వం వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా వంటి పథకాలతో ఆర్థిక సాయం అందిస్తోందని అన్నారు. ఈ సందర్భంగా కొంతమంది వృద్ధులు పింఛను గురించి ఎమ్మెల్యే వద్ద ఆవేదన వ్యక్తం చేయగా, మీరేం భయపడొద్దని పంచాయతీ కార్యాలయం వద్ద పింఛన్లు పంపిణీ చేస్తారని, రెండు నెలలు ఓపిక పడితే జగనన్న ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తుందని మళ్లీ యధావిధిగా పింఛన్లు మీ ఇంటి వద్దకే తెచ్చి ఇచ్చే ఏర్పాట్లు చేస్తారని వారికి భరోసా ఇచ్చారు. చంద్రబాబు చెబుతున్న బూటకపు హామీలు మాటలు నమ్మొద్దన్నారు. ఈ ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకే వేయాలన్నారు. బీసీ,ఎస్సీ కాలనీ, శెట్టిబలిజ కాలనీల్లో మహిళలు హారతులిచ్చి మా ఓట్లన్ని మళ్లీ ఫ్యాన్ గుర్తుకే అని తెలిపారు. చినరామభద్రపురం, ఒడ్డిమెట్ట, వేంపాడు, కాగిత గ్రామాల్లో కూడా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, సర్పంచ్ గొర్ల రాఘవకుమారి, ఉప సర్పంచ్ వేగేశ్న చంటి, మాజీ ఎంపీటీసీలు గొర్ల నర్సింహమూర్తి, దండు బలరామరాజు, మండల పార్టీ అధ్యక్షుడు నర్సింహమూర్తి, ఎంపీటీసీలు చంద్రరావు, బచ్చలరాజు, పీఏసీఎస్ అధ్యక్షులు మణి రాజు, పాపారావు, తాతారావు, మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జీ, అంగరాజు పెదరాము, సఖిరెడ్డి రమణ, వెంకటరావు, బాబూరావు, శేషారత్నం, జేసీఎస్ కన్వీనర్ ఎస్.గోవిందు, సురేష్ వర్మ పాల్గొన్నారు.

కరోనాలోనూ ఇంటి వద్దే పింఛన్లు ఇచ్చాం

- అప్పుడు లేని అభ్యంతరం ఇప్పుడెందుకు?
- డబ్బుతో అభిమానాన్ని కొనలేరు
- చంద్రబాబు తాను తీసిన గోతిలో తానే పడ్డారు
- వృద్ధుల ఆగ్రహం చవి చూస్తున్నారు
- ఎమ్మెల్యే కంబాల జోగులు



దేవవరంలో విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

నక్కపల్లి: కరోనా తీవ్రంగా ఉండి ప్రాణాలకు బయపడి కాలు బయటపెట్టలేని పరిస్థితుల్లో కూడా వలంటీర్లు అవ్వాతాతల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేసారని, ఇటువంటి త్యాగమూర్తులపై చంద్రబాబు రాజకీయంగా కక్ష సాధించడం నీతిమాలిన చర్య అని రాజాం ఎమ్మెల్యే, పాయకరావుపేట సమన్వయకర్త కంబాల జోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం దేవవరంలో విలేకర్లతో మాట్లాడారు. కరోనా సమయంలో జగనన్న ప్రభుత్వం వలంటీర్ల ద్వారా పింఛన్లు నిత్యావసర సరుకులు బట్వాడా చేయకపోయినా, సంక్షేమ పథకాలు అమలు చేయకపోయినా ఎంతో నష్టం జరిగేదన్నారు. అప్పుడు లేని అభ్యంతరాలు ఇప్పుడెందుకు వచ్చాయని ఆయన చంద్రబాబును ప్రశ్నించారు. వలంటీరు, సచివాలయ వ్యవస్థను చంద్రబాబు రాజకీయం చేస్తున్నాడని మండి పడ్డారు. ప్రభుత్వానికి మంచి పేరు రావడం, పేదలకు లబ్ధి కలగడం చంద్రబాబుకు ఇష్టం లేదన్నారు. దీనికి తగిన మూల్యం చెల్లించుకుంటారన్నారు. పింఛన్లు అడ్డుకోవడం ద్వారా ప్రభుత్వం వద్ద డబ్బుల్లేవు, పింఛన్లు ఇవ్వలేదనే తప్పుడు ప్రచారం చేద్దామని కుట్ర పన్నాడని, కానీ తాను తీసిన గోతిలో తానే పడ్డారని అన్నారు. అవ్వాతాతల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంటోందని, వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు తగిన గుణపాఠం చెప్తారన్నారు.

లూటీ సొమ్ముతో రమేష్ జనాన్ని కొనాలని చూస్తున్నారు...

కూటమి అభ్యర్థి సీఎం రమేష్ బ్యాంకులను లూటీ చేసిన సొమ్ముతో అనకాపల్లి జిల్లా ప్రజలను కొనాలని ప్రయత్నిస్తున్నారన్నారు. అతనికి స్పెషల్‌గా సొంత విమానాలు ఉన్నాయని, కాంగ్రెస్ వారికి, పవన్‌కల్యాన్‌కు, చంద్రబాబుకు వాటిని ఉచితంగా ఇస్తుంటాడన్నారు. ఇలాంటి వ్యక్తిని ఎంపీగా గెలిపిస్తే గల్లీలో ఉండే మనం ప్రతి పనికీ ఢిల్లీ వైపు చూడాల్సిన దుస్థితి ఏర్పడుతుందన్నారు. జిల్లా మంత్రిగా ఎంతో సుపరిచితులైన బూడి ముత్యాలనాయుడిని ఎంపీగా, అలాగే ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని మీ అందరికి అందుబాటులో ఉంటామన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ కాసులమ్మ, వైస్ ఎంపీపీ నానాజీ సర్పంచ్ రాఘవకుమారి, పీఏసీఎస్ అధ్యక్షులు పాపారావు, తాతారావు, మాజీ ఎంపీటీసీలు నర్సింహమూర్తి, బలరామరాజు, మండల పార్టీ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, నాయకులు అంగరాజు పెదరాము, బత్తుల అప్పారావు, సూరి సత్తిబాబు, వెంకటరావు, గొర్లగోవిందు పాల్గొన్నారు.

ధనవంతుడు, సామాన్యుడి మధ్య పోరు ఇది..



కోటవురట్లలో ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు

కోటవురట్ల : రూ.వేల కోట్లు ఉండి అవినీతి మచ్చలున్న ఓ ధనవంతుడికి, అతి చిన్న పల్లెటూరులో పుట్టి వార్డు మెంబరుగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఓ సామాన్య కుటుంబానికి చెందిన నాకు జరుగుతున్న పోరులో విజయం మనవైపే ఉందని అనకాపల్లి జిల్లా ఎంపీ అభ్యర్థి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. కోటవురట్లలో వైఎస్సార్‌సీపీ ముఖ్యనాయకులతో ఆయన బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించి ప్రతి ఒక్కరినీ పరిచయం చేసుకున్నారు. చంద్రబాబు అండ్ కో కడప నుంచి రూ.వేల కోట్లు ఉన్న సీఎం రమేష్‌ను తీసుకొచ్చి ఇక్కడ బీజేపీ తరపున ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయిస్తున్నారన్నారు. ఓ రైతు కుటుంబానికి చెందిన బీసీ వ్యక్తిని అయిన నేను అంచెలంచెలుగా ఎదుగుతూ రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి నీతి నిజాయితీతో నిబద్ధత కలిగిన వ్యక్తిగా సామాన్యులకు నిత్యం అందుబాటులో ఉంటూ వచ్చానన్నారు. తనకు కోటవురట్ల మండలం అంటే ఎంతో ఇష్టమని, తంగేడు రాజులంటే అభిమానం ఉందన్నారు. మీ అందరి అభిమానంతో గెలిచాక కోటవురట్ల మండలాన్ని ఎంపీ నిధులతో అభివృద్ధి చేస్తానన్నారు. తనలాగా ఇక్కడ పోటీ చేస్తున్న కంబాల జోగులును కూడా టీడీపీ నాయకులు చాలా ప్రలోభపెట్టారని అయినా దేనికీ లొంగని నిజాయితీ పరుడు, మంచి వ్యక్తి అన్నారు. ఆయనను కూడా మంచి మెజారిటీతో గెలిపించుకోవలసిన బాధ్యత మనపై ఉందన్నారు. ఎంఎస్‌ఎంఈ చైర్మన్ డి.వి.సూర్యనారాయణరాజు మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు వార్డు మెంబరుగా రాజకీయ జీవితం ప్రారంభించి ఇప్పటి వరకు ఓటమి ఎరుగని నాయకుడిగా ఎదిగారన్నారు. ఎమ్మెల్యేగా కంబాల జోగులును, ఎంపీగా బూడి ముత్యాలనాయుడును అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్.సీతారామరాజు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి యల్లపు కుమారరాజా, మండల పార్టీ అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఆర్.ఎస్ సత్యనారాయణ రాజు, ఆర్.ఎస్.నారాయణమూర్తిరాజు, శింగంపల్లి కిషోర్, మాజీ ఎంపీపీ కిల్లాడ సాయి, సర్పంచులు, ఎంపీటీసీలు, బూత్ కమిటీ కన్వీనర్లు, సోషల్ మీడియా కన్వీనర్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

దళితులంతా వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలి



రెల్లి కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు



రెల్లికాలనీలో సీతారాములను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

ఎస్.రాయవరం : దళిత కాలనీల్లో ఓట్లు అన్నీ వైఎస్సార్‌సీపీకే వేయాలని పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు కోరారు. మండల కేంద్రంలో బుధవారం పర్యటించిన ఆయన ఎస్సీ, ఎస్టీ, బీసీ, రెల్లి కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి గౌరవించిన నేత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. కులాల వారీగా సంక్షేమ పథకాలు అందించి వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటును అందించారన్నారు. దళితులెవరూ వేరే పార్టీకి ఓటు వేసే ప్రసక్తి లేదని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు, సర్పంచ్ భూపతి అప్పారావు, ఎంపీటీసీ బైపా శ్రీనివాసరావు, పార్టీ జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, డీసీసీబీ డైరెక్టర్ సత్యవతి పాల్గొన్నారు.

సీతారాములను దర్శించుకున్న ఎమ్మెల్యే

ఎస్.రాయవరం రెల్లి కాలనీలో ఆలయ పునర్నిర్మాణం చేసి సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కంబాల జోగులు శ్రీరాముని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, జిల్లా పార్టీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, సర్పంచ్ భూపతి అప్పారావు, ఎంపీటీసీ బైపా శ్రీనివాసరావు, డీసీసీబీ డైరెక్టర్ సత్యవతి, మాజీ సర్పంచ్ లక్కోజు ఆదిమూర్తి, స్థానిక నాయకులు కుర్రా కాశి, బంగారి పాల్గొన్నారు.

జోరుగా వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం



మునగపాకలో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



పాయకరావుపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

మునగపాక: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ బుధవారం వైఎస్సార్‌సీపీ శ్రేణులు మునగపాకలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందడంతో పాటు రాజన్న పాలన అందాలంటే ఎంపీ అభ్యర్థిగా బూడి ముత్యాలనాయుడుకు, ఎమ్మెల్యే అభ్యర్థి యు.వి.రమణమూర్తిరాజును ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి,జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణలు కోరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీటీసీ లు సూరిశెట్టి రాము, బోడకుర్తి గణేష్,పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఆడారి కాశీబాబు, సచివాలయ కన్వీనర్ బొడ్డేడ మహేష్, పార్టీ నేతలు అప్పారావు, సంతోష్‌కుమార్, శివగణేష్, జగన్నాథరావు,జగ్గు పాల్గొన్నారు.

పాయకరావుపేట : పట్టణంలో బృందావనం, లింగాలకాలనీ, రాజుగారిబీడు, ఇందిరాకాలనీ, తదితర ఏరియాల్లో నాయకులు వైఎస్సార్‌సీపీ గుర్తు ఫ్యాన్‌కే ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రచారం చేశారు. జెడ్పీటీసీ సూరిబాబు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు సాయిబాబా, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు బాబూరావు, పంచాయతీ వార్డు మెంబర్లు మహేష్,జగతా శ్రీను, మోహన్, ఉమామహేశ్వరి పాల్గొన్నారు. రాజుగారిబీడులో ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు రామకృష్ణ,అన్నవరం దేవస్థానం డైరెక్టర్ సుందర్రావు, ఆయా కాలనీల్లో పార్టీ జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి వేమగిరి లక్ష్మణ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నానాజీ, బీసీ సెల్ నాయకులు సత్తిబాబు, పప్పు శివ, ధనిశెట్టి తులసీ ప్రచారం ముమ్మరంగా సాగిస్తున్నారు.

ఆధ్యాత్మికత పెరగాలి

రాంబిల్లి : గ్రామాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని సమరసత సేవా ఫౌండేషన్ ధర్మ ప్రచారక్ అప్పారావు కోరారు. కొండవారపాలెం దుర్గాలమ్మ ఆలయంలో బుధవారం సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉగాది సందర్భంగా చేపట్టే కార్యక్రమాలపై చర్చించారు.

తాపీమేస్త్రిల సంఘ సభ్యులకు సత్కారం



తాపీమేస్త్రిలను సత్కరిస్తున్న గోవిందరావు తదితరులు

ఎస్.రాయవరం: సామాజిక దృక్పథంతో ప్రజలకు సేవ చేసే ఆనందం మరొక్కటి ఉండదని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ అయిన బొలిశెట్టి గోవిందరావు అన్నారు. మండల కేంద్రంలో శ్రీ శివ సత్యనారాయణ తాపీ మేస్త్రుల సంఘ సభ్యులను బుధవారం ఘనంగా సత్కరించారు. గ్రామంలో ఏ అన్న సమారాధన జరిగినా పలు సేవా కార్యక్రమాలు చేయడంలో ఈ సంఘ సభ్యులు ముందుంటారని గోవిందరావు అభినందించారు. అదే క్రమంలో రెల్లికాలనీ రామాలయం వద్ద అన్న సమారాధనలో సేవలందించి సంఘ సభ్యులను గోవిందరావు దుస్సాలువాతో ఘనంతా సత్కరించారు. తాపీమేస్త్రిల సంఘ అధ్యక్షుడు కాసా వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, సర్పంచ్ భూపతి అప్పారావు పాల్గొన్నారు.

గుర్రాజుపేటలో నేడు నూకాంబిక ఆలయ ప్రతిష్ఠ



శాంతి హోమం చేస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : గుర్రాజుపేటలో నూకాంబిక అమ్మవారి ఆలయ ప్రతిష్టా మహోత్సవం, ఆలయ ప్రారంభోత్సవం గురువారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మంగళవారం నుంచి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు ప్రారంభించారు. గ్రామస్తులు విరాళాలు సుమారు రూ.20 లక్షలకు పైగా సమకూర్చి ఆలయ నిర్మాణం చేసినట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో బుధవారం శాంతి హోమం నిర్వహించారు. మంటపార్చన, దేవతా వాహనం, క్షీరాధివాసం, జలాధివాసం, సాయంత్రం ధాన్యాధివాసం, పుష్పాధివాసం, శయ్యాధివాసం కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం ప్రాకార సంస్కార అమ్మవారి ప్రతిష్టా మహోత్సవం, బలిహరణం, పూర్ణాహుతి, చతుర్వేద స్వస్తి దీక్షా విరమణ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుంటారని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.